క్లుప్తంగా

ప్లాస్టిక్‌తో ముప్పు



స్టీల్ బ్యాంకును ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వస్తువులతో కేన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు వస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ దుర్గారెడ్డి, వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

తండాల రోడ్లకు మహర్దశ

ఎమ్మెల్యే సతీష్‌కుమార్



హుస్నాబాద్: నియోజకవర్గంలోని గిరిజన తండాల రోడ్ల నిర్మాణానికి గిరిజన అభివృద్ధి సంస్థ ప్రత్యేకంగా రూ. 31.58 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. తండాల్లో మౌలిక సదుపాయాల కోసం అత్యధిక నిధులు కేటాయించి గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచిన నాయకుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. ఈసందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్, సహకరించిన మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, దయాకర్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు.

కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా 'కొండం'



చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని చర్ల అంకిరెడ్డిపల్లికి చెందిన కొండం శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు గురువారం జిల్లా అధ్యక్షుడు కొన్యాల బాలకృష్ణారెడ్డి నియామక పత్రం అందజేశారు. రైతు సమస్యలపై తన వంతుగా పోరాటం చేస్తానని ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

10న సిద్దిపేటలో జిల్లా మహాసభ

సిద్దిపేటకమాన్: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా మహాసభను ఈనెల 10న సిద్దిపేట విపంచి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు జిల్లా శాఖ అధ్యక్షుడు రంగాచారి తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. మహాసభకు మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఆత్మీయ అతిథులుగా ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, యూనియన్ జాతీయ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కవి, రచయిత నందిని సిదారెడ్డి, ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దౌల్తాబాద్(దుబ్బాక): నిరుపేదల కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం పార్టీ మండలాధ్యక్షుడు పడాల రాములు ఆధ్వర్యంలో అప్పాయిపల్లికి చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారు లాలు, నాయకులు మద్దెల స్వామి, ఆది వేణుగోపాల్, భద్రయ్య, దశరథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న సూర్యవర్మ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డాక్టర్ సూర్యవర్మ అన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, వెనకబడిన వర్గాల సంక్షేమం కోసం పనిచేసేది కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అర్షద్ హుస్సేన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మున్నా, డీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, డీసీసీ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి కుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చినుకు.. చిత్తడి



దుబ్బాక పట్టణంలోని 16వ వార్డు బస్టాండ్ సమీపంలో వర్షాలకు రోడ్డు చిత్తడిగా మారింది. దీంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – దుబ్బాక

ఏపుగా పెరిగి.. రోడ్డుపైకి చేరి

చేర్యాల మండల పరిధిలోని చుంచనకోట శివారులో సర్కారు తుమ్మ చెట్లు ప్రమాదకరంగా మారాయి. యాదగిరిగుట్ట వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా పెరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వెంటనే తొలగించాలని కోరుతున్నారు. – చేర్యాల(సిద్దిపేట)



వంతెన.. అంతేనా?



చిట్యాల శివారులోని వాగుపై వంతెన నిర్మాణం చేపట్టి రైతులు, గ్రామస్తుల ఇబ్బందులు తీర్చాలని గురువారం పలువురు నీటిలో దిగి నిరసన వ్యక్తం చేశారు. వాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని సర్పంచ్ రామ్మోహన్‌రావు కోరారు. – చేర్యాల(సిద్దిపేట)

గోపాల.. గోపాల



రాజగోపాల్‌పేటలో..

శ్రీ కృష్ణాష్టమిని జిల్లావ్యాప్తంగా గురువారం ఘనంగా జరుపుకున్నారు. గోపిక, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. అలాగే పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చేర్యాల: కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు



సిద్దిపేటలో..



హుస్నాబాద్: పూజలు చేస్తున్న భక్తులు



హుస్నాబాద్: పిండి వంటలతో కృష్ణుడికి నైవేద్యం

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ బెన్ షాలోమ్

ఆర్డీఓ బెన్ షాలోమ్

హుస్నాబాద్: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్, పోలీస్ సెక్టోరల్ పాత్ర కీలకమని ఆర్డీఓ బెన్ షాలోమ్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. మూడు జిల్లాల పరిధిలోని నియోజకవర్గ ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, తహసీల్దార్లు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో ఉన్నందున.. దీనిని ప్రత్యేకంగా పరిగణించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సాఫీగా జరిగేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ సతీష్, హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, సీఐ కిరణ్, అధికారులు పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్ ముసుగులో అవినీతి



మాట్లాడుతున్న భాస్కర్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి ఆలయ చైర్మన్ ముసుగులో భిక్షపతి అవినీతికి పాల్పడడం సిగ్గుచేటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సనాది భాస్కర్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గుట్టపైన ఎల్లమ్మ ఆలయం వద్ద పాకశాల నిర్మాణం చేపడుతామని హైదరాబాద్‌కు చెందిన ఓ యాదవ భక్తుడి వద్ద రూ. 5 లక్షలు తీసుకున్నాడని ఆరోపించారు. కోట్లాది రూపాయల ఆలయ సొమ్మును ఖర్చుపెట్టి కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు తీసుకున్నాడని మండిపడ్డారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని తీసుకున్న డబ్బులను లెక్కలతో సహా నిరుపిస్తామన్నారు. ఇప్పటికైనా ఆలయ ప్రాంగణంలోని గంగిరేణి చెట్టు కింద చర్చకు రావాలని సవాల్ విసిరారు. రాంసాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్, నాయకులు బాలకిషన్, బద్దిపడగా కృష్ణారెడ్డి, తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం ,మేకల కృపాకర్, సార్ల యాదయ్య, నీల భిక్షపతి, ఎల్లయ్య, ఆనందం, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం



చెక్కులను పంపిణీ చేస్తున్న అంజిరెడ్డి

ములుగు(గజ్వేల్): నిరుపేదలకు అండగా సీఎం సహాయ నిధి పథకం నిలుస్తుందని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్, ములుగు పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి పేర్కొన్నారు. ములుగుకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను గురువారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి పథకం మండలవ్యాప్తంగా వందలాది మంది పేదలకు కొండంత అండగా నిలిచిందని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కర్ణాకర్‌రెడ్డి, కనకయ్య, శ్రీరాం, అబ్బు, దశరథం, కృష్ణ, చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

'జోడో'ను స్ఫూర్తిగా తీసుకుందాం



సిద్దిపేటలో కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రను స్ఫూర్తిగా తీసుకొని ఐక్యంగా పనిచేద్దామని టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జోడో యాత్ర ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేఆర్ చౌరస్తా నుంచి ముస్తాబాద్ చౌరస్తా వరకు గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో దేశ ప్రజలు ఎంతో నష్టపోయారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు అత్తు ఇమామ్, లక్ష్మి, శంకర్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర సువర్ణ అక్షరాలతో లిఖించదగినదని యూత్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ ఎండీ ఇల్తాక్ పేర్కొన్నారు. బెజ్జంకిలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజిద్, కార్యదర్శి శ్యాంసుదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మద్దూర్‌లో నాయకుల సంబురాలు

మద్దూరు(హుస్నాబాద్): రానున్న ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టడం ఖాయమని పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం మద్దూరులో పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాములు, భద్రప్ప, శ్రీధర్‌రెడ్డి, భూపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: బీజేపీ మెదక్ పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమం గురువారం గజ్వేల్‌లో నిర్వహించారు. మెదక్ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ వర్గంటి రామ్మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కర్ణాటకలోని దక్షిణ బెల్గాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభయ్ పాటిల్‌తో పాటు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతంతో పాటు అధికారంలోకి రావడమే లక్ష్యంగా పలు అంశాలపై చర్చించామని తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డితో పాటు మెదక్ పార్లమెంట్ పరిధిలోని రాష్ట్ర పదాధికారులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గాల కన్వీనర్లు, కోకన్వీనర్లు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల సందర్శన

గజ్వేల్‌రూరల్: త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గజ్వేల్ ఏసీపీ రమేష్ గురువారం పలు పోలింగ్‌స్టేషన్లను సందర్శించారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు డివిజన్ పరిధిలో ఏర్పాటు చేయనున్న పోలింగ్‌స్టేషన్ల వివరాలను సేకరించి, వాటి స్థితిగతులను పరిశీలించారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

మిరుదొడ్డి(దుబ్బాక): డీబీఎఫ్, బామ్‌సేఫ్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి దుబ్బాక నియోజకవర్గంలో చేపట్టే సామాజిక పరివర్తన పాదయాత్రను విజయవంతం చేయాలని బామ్‌సేఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాంపల్లి పిలుపునిచ్చారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు.

సన్మానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులని లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ మండల శ్రీనివాస్ అన్నారు. గురువారం సిద్దిపేట స్ఫూర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.

ఎన్నిక ఏకగ్రీవం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం లకుడారం ఉపసర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న బింగి వెంకటేశ్ వార్డు సభ్యుడి పదవికి అనర్హుడంటూ కోర్టు ఇటీవల తీర్పునిచ్చింది. రెండో స్థానంలో నిలిచిన కానుగుల బాలేశంను వార్డు సభ్యుడిగా కొనసాగించాలని పేర్కొంది. ఈక్రమంలో ఉపసర్పంచ్ పదవికి ఖాళీ ఏర్పడంతో జీపీ నిర్వహణ జమ ఖర్చుల విషయం పెండింగ్‌లో పడింది. పై అధికారుల సూచనల మేరకు గురువారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కందూరి కనకవ్వ అధ్యక్షతన ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్‌తో పాటు వార్డు సభ్యుల అంగీకారంతో (ఉపసర్పంచ్ స్థానంలో) కానుగుల బాలేశం ఎన్నికైనట్లు ఎంపీఓ వీరరాజు తెలిపారు. బాలేశం సంతకం చెల్లుబాటు అయ్యేలా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కేంద్రం విధానాలను తిప్పికొడదాం



సిద్దిపేట: కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడదామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ పిలుపునిచ్చారు. గురువారం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా సిద్దిపేట కొత్త బస్టాండ్ చౌరస్తాలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వాపోయారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్, నవీన, శ్రీనివాస్, నాయకులు శిరీష, కనకయ్య, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే గజ్వేల్ పట్టణంలోని సంగాపూర్ కమాన్ వద్ద సీపీఐఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రజాసంక్షేమాన్ని మరిచిన కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు హుస్నాబాద్ మండల సమావేశం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ లకావత్ మానస అధ్యక్షతన శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కుమారస్వామి గురువారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

◆ గొర్రెల పంపిణీ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్, చిలాపూర్‌పల్లె గ్రామాల్లో లబ్ధిదారులకు గురువారం అరుయూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ రావుల మొండయ్య, రైతు బంధు నాయకులు ఎరవెల్లి శ్రీనివాస్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని ఘణపూర్ క్లస్టర్‌కు గోపాలమిత్ర పోస్ట్ మంజూరైందని పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా కార్యనిర్వహక అధికారి డాక్టర్ కొండల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు ఈనెల 15 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ నిధుల మంజూరుపై హర్షం



అక్కన్నపేట(హుస్నాబాద్): గిరిజన తండాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు గురువారం హన్మకొండలోని తన నివాసంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ధరావత్ తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో సన్మానించారు. మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రకటించారు.

◆ ప్రభుత్వ వైఫల్యాలను వివరించండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ మహిళా విభాగంపై ఉందని తెలంగాణ కాంగ్రెస్ మహిళా విభాగం కోఆర్డినేటర్ షాహీన్ అన్నారు. సిద్దిపేట పట్టణంలో గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా మహిళా విభాగం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చంద్రం, రెజీనా, శాంతమ్మ, లక్ష్మి, ప్రణవి, నరసవ్వ, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

◆ వీహెచ్‌పీ ఆవిర్భావ దినోత్సవం

చేర్యాల(సిద్దిపేట): విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం పట్టణ కేంద్రంలో జిల్లా ఉపాధ్యక్షుడు తడ్క లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అభయాంజనేయ స్వామి ఆలయ సమీపంలో వీహెచ్‌పీ జెండాను ఆవిష్కరించారు.

◆ పండ్ల రసం పంపిణీ



కోహెడ(హుస్నాబాద్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా కోహెడ అంబేడ్కర్ చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముహబ్బత్‌కి దుకాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో పాదయాత్ర ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా పండ్ల రసం పంచారు. కార్యక్రమంలో ఎండీ ఇల్తాజ్, మాజిద్‌ఖాన్, శ్యాంసుందర్‌రెడ్డి, దూలం శ్రీనివాస్, శివారెడ్డి, వెంకటస్వామి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

◆ కృష్ణస్వామి సేవలు మరువలేనివి

గజ్వేల్‌రూరల్: ముదిరాజ్‌ల ఐక్యతకు పాటు పడిన గొప్ప వ్యక్తి కొరివి కృష్ణస్వామి అని ముదిరాజ్ యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, నియోజకవర్గ కొరివి కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు నాగేష్, ముదిరాజ్ యూత్ అధ్యక్షుడు రిప్పల స్వామి కొనియాడారు. కృష్ణస్వామి జయంతి సందర్భంగా గురువారం గజ్వేల్ పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా గజ్వేల్, మర్కూక్ మండలాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు.